క్లుప్తంగా

వాడపల్లి ఆలయానికి మొక్కల అందజేత

కడియం: వాడపల్లి వేంకటేశ్వర స్వామి దేవాలయానికి సుమారు రూ.50 వేల విలువైన ఫల, పుష్ప, అలంకార మొక్కలను కడియం గ్రామానికి చెందిన యువ నర్సరీ రైతు వెన్నపు మణికంఠ స్వామి విరాళంగా అందజేశారు. ప్రతి శనివారం స్వామివారి దర్శనానికి వెళ్లే మణికంఠ ఈ మేరకు ఆలయ సిబ్బందిని సంప్రదించగా, కొన్ని పుల, పుష్ప జాతుల మొక్కలు ఇవ్వాలని సూచించారు. స్వామివారి ఆలయ ద్వారాలకు కట్టే మామిడి తోరణాలకు ఉపయోగపడే మామిడి మొక్కలు కావాలని కోరారు. ఈ మేరకు మొక్కలను ఆలయానికి ఎగుమతి చేశారు. ఈ సందర్భంగా మణికంఠ స్వామి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా తనవంతుగా పుణ్యక్షేత్రాలకు, ప్రభుత్వ పాఠశాలలకు మొక్కలు ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు.

8 నుంచి వరలక్ష్మి అమ్మవారి మహోత్సవాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హేమావతి మాతాజీ తదితరులు

సీటీఆర్‌ఐ: పాలచర్ల రోడ్డులోని గాడాలలో ఉన్న మహాలక్ష్మి సమేత చిన వేంకటేశ్వర స్వామివారి పీఠంలో వరలక్ష్మి అమ్మవారి మహోత్సవాలు జరుగుతాయని డాక్టర్ చిన్న వేంకన్నబాబు స్వామిజీ భార్య హేమావతి మాతాజీ తెలిపారు. స్థానిక జయశ్రీ గార్డెన్స్‌లో మంగళవారం ఈ పోస్టర్‌ను ఆమెతో పాటు, మతల సాయి మాధవీ శ్రీలత ఆవిష్కరించారు. ఈ నెల 8న మహాలక్ష్మి హోమం, 15న వరలక్ష్మి హోమం, 22న వ్యూహలక్ష్మి హోమం, 29న అష్టలక్ష్మి ధన్వంతరి హోమం, సెప్టెంబర్ 2న వారాహి దేవి అమ్మవారికి అభిషేకం, హోమం నిర్వహించనున్నట్టు మాతాజీ వివరించారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులకు అష్టలక్ష్మి యంత్రం, రాగి మహాలక్ష్మి డాలర్, వారాహి దేవి అమ్మవారి అభిషేక గంధం ప్రసాదంగా ఇస్తారని ట్రస్ట్ ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్ తెలిపారు.

కార్యకర్తకు అండగా గొందేశి

రూ.20 వేల ఆర్థిక సాయం



నాగేశ్వరరావుకు చెక్కును ఇస్తున్న నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి, ఇంటి వద్ద చికిత్స పొందుతున్న బొమ్మూరు గ్రామానికి చెందిన ఇమ్మన నాగేశ్వరరావుకు గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు వ్యవస్థాపకుడు, వైఎస్సార్ సీపీ నేత గొందేశి శ్రీనివాసులరెడ్డి అండగా నిలిచారు. చికిత్స పొందుతున్న నాగేశ్వరరావుకు ట్రస్టు ద్వారా రూ.20 వేల చెక్కును మంగళవారం ట్రస్టు ప్రతినిధులు, పార్టీ నాయకులు యెనుముల త్యాగరాజు, కాకులపాటి కుమార్ తదితరుల చేతుల మీదుగా అందించారు. వారికి నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

మొక్కల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ: అరణ్యానికి వెలుపల ఉన్న చెట్లు అటవీ వనరులపై ఒత్తిడి తొలగించి, వ్యవసాయ భూములను కాపాడతాయని జనకల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ ఎమ్మెస్సార్ కిశోర్ తెలిపారు. డాబర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ జీవంతీ వెల్ఫేర్ చారిటబుల్ సంస్థ ఆర్థిక సహకారంతో ట్రీస్ ఔట్ సైడ్ ఆఫ్ ఫారెస్ట్ పథకంలో మంగళవారం తూర్పు గోదావరి జిల్లాలో సుమారు ఎనిమిది వేల మొక్కలను రైతులకు అందించామని వివరించారు. మారేడు, నేరేడు, ఉసిరి, గుమ్మడిలేకు, ఎర్రచందనం, శ్రీగంధం మొక్కలు ఇందులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో 15 వేల మొక్కలు రైతులకు అందించి, వారితో నాటించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాలో 2024–25 విద్యా సంవత్సరానికి జరగనున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు 8వ తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ కె.వాసుదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష రాసేందుకు రాష్ట్రంలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఏపీ ఆదర్శ పాఠశాలల్లో చదువుతూ, కుటుంబ వార్షికాదాయం రూ.3 లక్షలు ఉన్న విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. పరీక్ష డిసెంబర్ 8న జరుగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల గడువు వచ్చే నెల 6తో ముగుస్తుందన్నారు. పరీక్ష రుసుము వచ్చే నెల 10లోగా చెల్లించాలన్నారు. ఆన్‌లైన్ అప్లికేషన్‌లో లింకు ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు.



జేగురుపాడులో జక్కంపూడి విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్



కడియపు సావరంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న నాయకులు



ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ సెంటర్‌లో జక్కంపూడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జన యోధుడు జక్కంపూడి



బుర్రిలంకలో రక్తదానం చేస్తున్న యువతను అభినందిస్తున్న మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులు



బొమ్మూరులో జక్కంపూడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చందన నాగేశ్వర్, గొందేశి తదితరులు

- బుర్రిలంకలో కొత్తపల్లి సోదరుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం
- జన నేత రామ్మోహనరావుకు ఘన నివాళులు
- అనేక చోట్ల సేవా కార్యక్రమాలు

కడియం: ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సాధించిన జన యోధుడు జక్కంపూడి రామ్మోహనరావు అని మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని బుర్రిలంకలో దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు 71వ జయంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు కొత్తపల్లి శివాజీ, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు కొత్తపల్లి మూర్తి ఆధ్వర్యంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి ముఖ్యఅతిథులుగా చెల్లుబోయిన, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాజశ్రీ దంపతులు హాజరై, శిబిరాన్ని ప్రారంభించారు. ముందుగా జక్కంపూడి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి చెల్లు బోయిన వేణు మాట్లాడుతూ జక్కంపూడి రామ్మోహన్‌రావు ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. ఆ మహనీయుని జయంతి సందర్భంగా గత 14 ఏళ్లుగా ఇటువంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న కొత్తపల్లి శివాజీ, మూర్తిని అభినందించారు. ప్రజా నేత రామ్మోహనరావు సేవా తత్పరతకు ఆయన కుమారులు వారసులుగా ఉన్నారన్నారు. వైఎస్సార్ జక్కంపూడి బ్లడ్ బ్యాంక్ వైద్యుల పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో పెద్దఎత్తున యువత రక్తదానం చేశారు. రక్తదాతలను ముఖ్యఅతిథులు అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, అఖిల భారత నర్సరీల సంఘం మాజీ అధ్యక్షుడు పల్ల సుబ్రహ్మణ్యం, కడియపు సావరం మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు, పార్టీ నాయకులు తిరుమలశెట్టి శ్రీను, ఊటుకూరి శైలజ, గాద రామకృష్ణ, రత్నం కృష్ణ, ముత్యం జగదీష్, పంతం రాము, గాద సుబ్రమణ్యం, బుడ్డిగ పండు, దాసరి శ్రీను, జక్కంపూడి అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జక్కంపూడి సేవలు ఎనలేనివి

మాజీ మంత్రి, దివంగత జక్కంపూడి రామ్మోహనరావు సేవలు ఎనలేనివని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. రామ్మోహనరావు జయంతి సందర్భంగా మండలంలోని జేగురుపాడులో ఆయన విగ్రహానికి మంగళవారం పుష్పాంజలి ఘటించారు. జక్కంపూడి అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో రామ్మోహనరావు సేవలు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుల సుధాకర్, మాజీ ఎంపీటీసీలు నాగిరెడ్డి వీరశివాజీ, పాలపర్తి ప్రకాష్‌కుమార్ (పండు), పార్టీ నాయకులు బళ్ల అన్నవరం, శాకా కిరణ్, పెరుగు నాగేశ్వరరావు, పుట్టా బుజ్జి, దుడే రాజు, ఆకుల పండు, నాగిరెడ్డి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

- అలాగే కడియపు సావరంలో మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. అంతకుముందు రామ్మోహనరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, జక్కంపూడి అభిమానులు పాల్గొన్నారు.
- కడియపులంక జాతీయ రహదారి పక్కన, దోసాలమ్మ కాలనీల్లో ఉన్న దివంగత జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహాలకు ఐఎస్‌ఏ మాజీ అధ్యక్షుడు పల్ల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామ్మోహనరావు సేవలు మననం చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పల్ల సత్యనారాయణమూర్తి, బోడపాటి సత్తిబాబు, నర్సరీ రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజా హృదయాలను గెలిచిన నేత

ధవళేశ్వరం: ప్రజల కష్ట సుఖాల్లో పాలుపంచుకుని, వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన జక్కంపూడి రామ్మోహనరావు జన యోధుడని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, ఆయన అభిమానులు కొనియాడారు. మంగళవారం ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో ఉన్న దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు విగ్రహం వద్ద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కంపూడి విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు సాధనల చంద్రశేఖర్(శివ), డాక్టర్ తోరాటి ప్రభాకరరావు, మెండా సత్తులు మాట్లాడుతూ నిరంతరం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి జక్కంపూడి అని కొనియాడారు. ధవళేశ్వరం ఎర్రకొండపై ఉన్న జక్కంపూడి రామ్మోహన్‌రావు విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కంపూడి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు పెన్నాడ జయప్రసాద్, శ్రీరంగం బాలరాజు, ముత్యాల పోసికుమార్, నారపురెడ్డి మురళి, గరగ శ్రీనివాసరావు, సత్యం వెంకటరమణ, షబ్బర్ బాషా, ముత్యాల జాన్, వీర్ల సాయి, నంబూరి రవి, గూటం రాజు, ఎల్వీ ప్రసాద్, బర్రి కామేశ్వరరావు, జంగా కిషోర్, రాజ్‌కపూర్, వేగెశెట్టి కోదండ రామారావు, బోడపాటి కుమార్ ,బొడ్డేటి శివాజీ, పెన్నాడ లక్ష్మి, గొన్నా సత్తిబాబు, ఆడారి సాంబమూర్తి, గండి అప్పారావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాత జక్కంపూడి: చందన

రాజమహేంద్రవరం రూరల్: అప్పటి కడియం నియోజకవర్గం, ప్రస్తుత రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు అని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ కొనియాడారు. మంగళవారం బొమ్మూరులోని వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు గొందేశి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో జక్కంపూడి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చందన, గొందేశి కేక్ కట్ చేసి, లెప్రసీ రోగులకు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జక్కంపూడిని ఆదర్శంగా తీసుకుని ప్రజలకు సేవలందించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యెనుముల త్యాగరాజు, తాడాల చక్రవర్తి, నాగులపల్లి ఆశాలత, మత్సేటి శివ, కాకులపాటి కుమార్, మరడాపు శేఖర్, మహిళా మండలి అధ్యక్షురాలు ఎస్కే సమీరా, సింహాద్రి రామలక్ష్మి, గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ

విమానాశ్రయాన్ని సందర్శించిన కలెక్టర్ ప్రశాంతి



రాజమహేంద్రవరం విమానాశ్రయాన్ని సందర్శిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

మధురపూడి: పర్యాటక రంగం అభివృద్ధి చెందేలా రాజమహేంద్రవరం విమానాశ్రయాన్ని తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టరు ప్రశాంతి తెలిపారు. మధురపూడిలోని విమానాశ్రయాన్ని ఆమె పరిశీలించారు. 2027 పుష్కరాలకు ముందుగా విమానాశ్రయంలో హరివిల్లు(పూల స్టాల్) ఏర్పాటుకు అధికారులతో చర్చించామన్నారు. జిల్లాను పర్యాటక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, నర్సరీల హబ్‌గా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యచరణ రూపొందించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు రూట్ మ్యాప్‌ను అధికారులతో కలసి పరిశీలించారు. ఇంచార్జి ఆర్డీవో కేఎల్ శివజ్యోతి, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వరరావు, ఏపీఎంఐపీ అధికారి దుర్గేష్ తదితరులు ఉన్నారు.

అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్

సీటీఆర్‌ఐ: ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరులో ప్రాధాన్యం, ప్రతి స్పందన ఉండాలని, ఆ మేరకు 100 రోజుల ప్రణాళికలతో ఆయా శాఖల అధికారులు సమగ్ర నివేదిక అందజేయాలని కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో ఇంచార్జి జేసీ జి.నరసింహులుతో కలిసి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టర్ల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం విజన్-2047పై దిశా నిర్దేశం చేసిందన్నారు. ఇందుకు జిల్లా స్థాయిలో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. దీనిపై జిల్లా ముఖ్య ప్రణాళికాధికారిని నోడల్ అధికారిగా నియమించినట్టు తెలిపారు.

పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు



జక్కంపూడి చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న గణేష్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: దివంగత మాజీ మంత్రి, పోరాట యోధుడు జక్కంపూడి రామ్మోహనరావు జయంతి సందర్భంగా ఆయన తనయుడు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రీజనల్ కో–ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, కుటుంబ సభ్యులు, మిత్ర బృందం ఆధ్వర్యంలో నగరంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కాలనీలో ఉన్న ప్రియదర్శిని చెవిటి, మూగ విద్యార్థుల ఆశ్రమంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామ్మోహనరావు కుమార్తె సింధు సహస్ర, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా దివంగత వైఎస్సార్, జక్కంపూడి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఆకుల వీర్రాజు మాట్లాడుతూ జక్కంపూడి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా పనిచేసి తూర్పు గోదావరి జిల్లా అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని నివాళులర్పించారు. ఆయన తనయుడు జక్కంపూడి రాజా, గణేష్‌లు రామ్మోహనరావు జయంతి సందర్భంగా రక్తదానం, అన్నదానం, ఉచిత వైద్య శిబిరాలు తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గణేష్ మాట్లాడుతూ తాము తండ్రి జక్కంపూడి రామ్మోహనరావు అడుగు జాడల్లో నడుస్తూ, ఆయన వర్ధంతి, జయంతి సందర్భంగా ఏటా పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి, ఆకుల శ్యామ్ పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాసా రామజోగ్ ఆధ్వర్యంలో జక్కంపూడి జయంతి వేడుకలను క్వారీ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కార్యకర్తలతో కలసి నివాళులర్పించారు.

చిన్నారుల దంత పరిశీలన అవసరం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్యాంసుందర్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: దంత సమస్యలపై అవగాహన ఉంటే వాటి పరిష్కారం సులభతరమవుతుందని జీఎస్ఎల్ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘంటా సునీల్ అన్నారు. సత్యసాయి గురుకులం, జీఎస్ఎల్ దంత వైద్య కళాశాల సంయుక్తాధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని గురుకులంలో రెండు రోజుల పాటు విద్యార్థులకు నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరం మంగళవారంతో ముగిసింది . ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ చిన్నారుల దంతాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. గురుకులం కరస్పాండెంట్ ఏ.శ్యాంసుందర్, ప్రిన్సిపాల్ కె.గురయ్య మాట్లాడుతూ సుమారు 1,200 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించగా, 550 మందికి సమస్యలున్నట్టు గుర్తించామన్నారు. వీరికి ఉచిత చికిత్స అందిస్తారన్నారు. శిబిరంలో 8 మంది దంత వైద్య ప్రొఫెసర్లు, 20 మంది సీనియర్, 40 మంది జూనియర్ డాక్టర్లు, సుమారు 80 మంది వైద్య విద్యార్థులు సేవలందించినట్టు తెలిపారు. అనంతరం వైద్య విద్యార్థులు లఘు నాటికను ప్రదర్శించారు. క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందించారు. గురుకుల కమిటీ సభ్యులు టి.సుందర్‌రెడ్డి, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారావు, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ పవిత్ర, డాక్టర్ హారిక తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న పద్మజ

ధవళేశ్వరం: పోషక విలువలు కలిగిన తల్లి పాలపై అవగాహన కలిగి ఉండాలని హెచ్‌యూఎల్ మానవ వనరుల సీనియర్ ఎగ్జిక్యూటివ్ పద్మజ అన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక జక్కంపూడి సీతారత్నం కల్యాణ మండపంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన పద్మజ మాట్లాడుతూ తల్లి పాల వినియోగంలో అపోహలను తొలగించి, ఆరోగ్య విలువలను చాటిచెప్పాలని కోరారు. అమెరికన్ ఇండియన్ ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ వీవీ దీపిక మాట్లాడుతూ తల్లులకు పౌష్టికాహారం అందించడం ద్వారా శిశువులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: ప్రజలకు మానసిక ఆరోగ్య సమస్యలపై, అందుబాటులో ఉన్న వైద్య సేవలపై అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ డా.కె.వెంకటేశ్వరరావు వైద్యాధికారులకు సూచించారు. జాతీయ మానసిక ఆరోగ్య అవగాహన దినోత్సవం సందర్భంగా మంగళవారం బొమ్మూరులోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వైద్యులు, వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మానసిక ఆరోగ్యంపై అవగాహన, సేవలనేది ఆరోగ్య రంగంలో ముఖ్యమైన అంశమన్నారు. మానసిక సమస్యలు ఉన్నవారు వీలైనంత త్వరగా వైద్య సలహా పొందడం శ్రేయస్కరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డా.హరిచంద్రప్రసాద్, డా.షమ్మీకుమార్, డా.మౌనిక, సూపరింటెండెంట్ సత్యనారాయణ, ఎస్‌ఓ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలకు 40 అదనపు గదులు

ఎమ్మెల్యే శ్రీనివాస్



ఆర్ట్స్ కళాశాలలో లైబ్రరీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కంబాలచెరువు: దాతల సహకారంతో రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలకు 40 అదనపు తరగతి గదులు నిర్మిస్తారని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఎంతోమంది విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దిన ఘన చరిత్ర ఆర్ట్స్ కళాశాలకు ఉందని చెప్పారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలోని వివిధ బ్లాక్‌లను ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, అధ్యాపకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు, కళాశాల లైబ్రరీలో సాంకేతిక విభాగాలతో పాటు, 1600 శతాబ్దం నుంచి నేటి వరకు గత చరిత్ర వైభవాన్ని తెలిపే పుస్తకాలను అందుబాటులో ఉంచడం ప్రశంసనీయమన్నారు. విద్యా సంపదను భవిష్యత్తు తరాలకు అందించాలనే దృక్పథంతో విద్యార్థులతోనే డిజిటలైజేషన్ చేస్తున్నట్టు చెప్పారు. లక్షకు పైగా ఉన్న పుస్తకాల్లో 40 వేలకు పైగా డిజిటలైజేషన్ పూర్తయిందన్నారు. అన్ని రంగాల్లో బోధన చేసే ఫ్యాకల్టీ ఉండటం విద్యార్థుల అదృష్టమన్నారు. కళాశాల నుంచి జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

రాజమహేంద్రవరం రూరల్: ఉపాధ్యాయుల వివిధ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని ఎస్టీయూ నగర శాఖ ప్రతినిధులు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని మంగళవారం ఆయన స్వగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మిగులు ఉపాధ్యాయులను అదే మున్సిపాలిటీల్లో సర్దుబాటు చేయాలని కోరారు. జీఓ 84ను రద్దు చేసి మున్సిపల్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ప్రమోషన్లు ఇవ్వాలని, బదిలీలు జరపాలని విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

కలిసి పోరాటం చేస్తాం

బీసీవై రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర యాదవ్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో ఎస్సీ, బీసీ, వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం చేసే పోరాటంలో మాజీ ఎంపీ హర్షకుమార్‌తో కలసి పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ ప్రకటించారు. మంగళవారం రాజమహేంద్రవరంలో మాజీ ఎంపీ హర్షకుమార్ నివాసంలో ఆయనతో భేటీ అయ్యారు. ఎస్సీ వర్గీకరణ అంశం రాజ్యాంగ సవరణ ద్వారా చేపట్టాల్సినదిగా రామచంద్ర యాదవ్ వ్యాఖ్యానించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో పాటు, రాష్ట్రంలో వివిధ సమస్యలపై సంయుక్త పోరాటం చేయనున్నట్టు వీరిద్దరూ ప్రకటించారు.

రేవులో తొలగిన బురద



పరిశుభ్రంగా ఉన్న ధవళేశ్వరం రామపాదాల రేవు

సాక్షి ఇంపాక్ట్

ధవళేశ్వరం: వరద తగ్గుముఖం పట్టడంతో ధవళేశ్వరంలోని ప్రధాన స్నాన ఘట్టాల వద్ద బురద పేరుకుపోవడంతో ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన 'వరద తగ్గింది.. బురద మిగిలింది' వార్తకు పంచాయతీ అధికారులు స్పందించారు. రేవుల్లో బురద మట్టిని తొలగించి, పుణ్యా స్నానాలు ఆచరించే వారికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు.

కూటమి నేతల సమావేశం

కడియం: ఎన్నికల వరకే రాజకీయాలని, అనంతరం అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. మురమండ చెరుకూరి కల్యాణ మండపంలో మంగళవారం టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గోరంట్లతో పాటు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

కడియం: అధ్యాపకులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. మంగళవారం ఆయన మురమండలోని పిచ్చుగ కోటయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. విద్యా ర్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రస్తుతమున్న విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అధ్యాపకులు కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ రాజ్‌మనోజ్ పాల్గొన్నారు.